[కథానిక] ['శ్రీపతి']

ఆశయసిద్ధి

"నేను ఇహ ఇక్కడ ఒక్కక్షణంకూడా ఉండలేను బావా! నువ్వు ఎంత మంచివాడివైనా నీకు ఈఇంట్లో రెండో స్థానమే కదా! మీ అన్నదమ్ములు అందర్లోకీ కాస్త చదువుకున్నవాడివి, నలుగురికీ చెప్ప గలవాడివి నువ్వే; అయినా ఈ కొంపలో నీ మాట వినే వాళ్లు ఒక్కరన్నా ఉన్నారా?"

"అవును; నువ్వుతప్ప ఇంకెవ్వరూ లేరు" అని మనోహరం అనూరాధమాటకు అడ్డంవచ్చాడు.

తన మాటకు అడ్డంవచ్చాడని అనూరాధ ఏమీ బాధపడ్లేదు. ఉన్నయథార్థం చెప్తూకూడా అదంతా పచ్చిఅబద్ధమైనట్లు యద్దేవగా అన్నందుకు మాత్రం మనోహరంమీద పట్టరాని కోపం వచ్చింది. అయినా కొంచెం తమాయించుకొని "ఈ కొంపలో కాపరం చేస్తూ నేనుమాత్రం నీమాట ఎలా వినగల్ను? మాట విని ఏం చేస్తాను? కావటానికి మేనత్తగారిల్లే. మీరూ, మీ నాన్నగారూ కావాలని మరీ సంబంధం కలుపుకున్న మాట నిజమే. బావ మంచివాడనీ, బియ్యే ప్యాసైనాడనీ, ఏపట్నంలోనో ఉద్యోగం చేస్తుంటే సుఖపడగల్ననీ నేనూ ఆశపడ్డాను. ఎవ రెట్లా ఉన్నా అత్త ఉందిగదా, నాకీయింట్లో కొర తేముంటుందిలే అనుకున్నాను. తీరా కాపరానికివస్తే పెత్తనానికి పెద్దకోడలూ, అపేక్షలకు ఆఖరుకోడలూ తయారై, నా స్థితి ఎటూ కాకుండాపోయింది. ఊళ్లో అందరూ అనుకోవడం అత్త ఇంటి అధికారం నాకు దఖలుపరి చిందనీ, మీనాన్న పెత్తనం నీకిచ్చి ఇనప్పెట్టెతాళం చేతులు నీమెళ్లో కట్టాడనీ. యథార్థస్థితి నీ మనస్సుకైనా తెలుసు. నాకు ఏం కావాలన్నా నేను నీకు చెప్పడం, నువ్వు మీఅమ్మకు చెప్పడం, మీఅమ్మ మీనాన్నకు చెప్పడం, మీనాన్న మీఅన్నకు చెప్పడం, మీఅన్న మీవొదిన్ని అడిగి చేస్తే చేయడం లేకపోతే లేదు. ఎన్నాళ్లీ అసమర్థపు బతుకు? మీరూ, మీరూ అంతా ఒకటే. ఎటొచ్చీ అయినదాన్ని నేను ఒక్కర్తెనే పరాయి దాన్ని అయినాను. నువ్వు ఎక్కడన్నా ఉద్యోగంఅయినా చూచుకో. లేదూ, మాఇంటికైనా పోదాం. మా తమ్ముడికి ఇంటిగొడవ పట్టలేదు. మాఅక్క పెళ్లి చేసుకోను పొమ్మంది. అంత పెత్తనం నువ్వే చేయొచ్చు. మానాయనకూడా ఒక్కడూ తంటాలుపడలేకుండా ఉన్నాడు" అని, అనూరాధ దాదాపు తన కథను పూర్తి చేసింది.

"అయితే నన్ను ఇల్లరికం రమ్మంటూ వన్న మాట! భేషుగ్గా ఉంది నీ సలహా. ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటివెనకాల చావమంటున్నావా? నేనుండి, మీమేనత్త ఉండి నీకు ఏలోటూ లేకుండా జరుపు కొస్తుంటేనే నీకు ఇక్కడ ఉండేందుకు అంత కష్టంగా ఉంటే, మేనమామఇంటికి ఇల్లరికంవెళ్లితే నాకు ఎలా ఉంటుందో కాస్త విచారించు. అయినా మీతమ్ముడు ఎర్రజెండాలముఠాలో చేరాడట. ఎప్పుడో, ఎక్క ణ్ణుంచో హఠాత్తుగా ఊడిపడి 'నువ్వెవరు, తేరసొమ్ము తిందామని వచ్చావ్? మా తాతా, మా నాన్నా కష్టపడి సంపాదిస్తే అనుభవిద్దామని తయారైనావేం' అని నాలుగుదులుపులు దులిపితే, నెత్తిన గుడ్డేసుకొని కాశీకు బుద్ధిచెప్పాలి! మీ అక్కకూడా వాడిపక్షమే టగా? వాళ్లిద్దర్నీ కాదని మీఅమ్మా, నాయనా మనిద్దరికీ తప్పు తలకెత్తుతారేం? నీకు ఇక్కడ ఉండటం ఇంత కష్టమైతే నువ్వు మహారాజుగా మీవాళ్లింటికి పోయి, అక్కాతమ్ముళ్లతో నువ్వూ ఒక ఎర్రజెండా ఎగరెయ్. నేనుమాత్రం రాను."

మనోహరం ఇంత నిర్మొహమాటంగా చెప్తాడనీ, తన మాటను కాదంటాడనీ అనూరాధ కలలో అయినా అనుకోలేదు. తనూ చదువుకున్నది. తనేంచెప్పినా మనోహరం ఇంతవరకూ కాదన్లేదు. అతడూ చదువుకున్నందుకు "పెళ్లాంమాట వినడమేమిటి ?" అనేతరహా మనిషి కాలేదు. కాని, ఆరోజురాత్రి అలా తననేగాక తన తమ్ముణ్ణి, అక్కనూ కూడా ఎర్రజెండాలవాళ్లని చులకనచేసి మాట్లాడ్డం అనూరాధకు ఏమీ అర్థం కాలేదు. ఎంత చదువుకున్నా స్వభావం మారటం అరుదుగనుక మనోహరానికి వొదినెగా రేమైనా మందు పెట్టిందేమో అని అనుమానపడింది. అనుమానం కలగ్గానే నివృత్తి చేసుకోవా లనుకుంది. పస్తాయించడం స్త్రీలక్షణం గాదు. అందులో అసూయ కల్గిం తరువాత వాళ్లకు మామూలుఇంగితజ్ఞానంకూడా ఉండదు. వాళ్లు నిద్దరపోరు; ఇతరుల్ని నిద్దరపోనీరు.

మనోహరానికి తమలపాకులతో డిమలు తుంచి, ఈనెలు తీసి, చిలకలు చుట్టి నోటికి అందిస్తూ ప్రక్కనే కూర్చొన్న అనూరాధ హఠాత్తుగా లేచి పక్కన ఉన్న ముక్కాలిపీటను దగ్గిరగా లాక్కొని దానిమీద కూర్చుంది. అప్పట్నుంచి తమలపాకుల ఈనెలు తీసి, మడిచి మంచంమీద పెడ్తూ వచ్చింది. మనోహరం అసలువిషయం గ్రహించకపోయినా తత్వం ఫిరాయించిందని తెలుసుకొని "అంత హడావిడిగా లేచేసరికి ఇప్పటికిప్పుడే మీవూరు ప్రయాణం కడ్తున్నా వనుకున్నాను మళ్లీ అక్కడ చతికిలబడ్డావేం" అన్నాడు.

"అవున్లే. నే నంతమాత్రం గ్రహించలే దనుకున్నావా బావా ? వదినెసంగతి నాకు తెలీదూ ? ఊరిపెత్తనం అంతా చేసే మీఅన్నయ్యే ఆమె ముందుకువస్తే 'ఏమిటిసెలవు?' అని రాజుగారిముందు సేవకుడల్లే ఉంటాడు. మీలాంటివాళ్లు ఆమె కొక లెఖ్ఖా, జమా ? పాపం, నేను ఎప్పుడు వెళ్తానా అని గంటలు లెక్కపెడుతున్నారుకాబోలు ! నే నట్లా పోయేదాన్ని కాదు. ఇంత చదువుకున్నందుకు ఆమాత్రంఆలోచన లేకపోలేదులే...

"బావా, మళ్లీ చెప్తున్నా విను. మీ అన్న సంసారం రోజురోజుకూ పెద్దదవుతున్నది. మున్నాటరవై రోజులూ వాళ్లత్తింటివైపువాళ్లు ఎవళ్లో ఒకళ్లు ఇక్కడ మేస్తూనే ఉన్నారు. ఇంటికి ఎంత చేరవేస్తున్నారో వాళ్లకూడా తెలియదు. నీతమ్ముడున్నాడంటే మిమ్మల్నందర్నీ మించినవాడు. మాతమ్ముడికంటెకూడా నాలుగాకులు ఎక్కువే చదివాడు. ఒకరిమీద ఇంకొకళ్ల అధికార మేమిటి అంటాడు. ఎవరెంత కష్టపడితే వాళ్లకంత ప్రతిఫలం ముట్టటం న్యాయం అంటాడు. ఎవడి అవసరాలకు తగ్గట్టు వాళ్లకు అన్నీ చెందడం ధర్మం అంటాడు. ఒకరి ఎక్కువా, ఇంకొకరి తక్కువా లేదంటాడు. అతనెప్పుడో తనభాగం తను పంచుకుపోయి స్వతంత్రంగా ఉంటాడు. మాతమ్ముడు ఇంకా అందాకా రాలేదు. ఇక మీరున్నారు—" అంటూ అనూరాధ కొంచెం ఉద్రేకంతో, కొత్తధోరణిలో ఉపన్యాసం సాగించబోతున్నది...

"అనూరాధా ! నన్నుగురించి నువ్వు చెప్పక్కర్లేదు. నాసంగతి నాకు తెలుసు. నీసంగతి నాకు తెలుసు. మావాళ్లిద్దరిసంగతీ నాకు తెలియదనుకోకు. మాతమ్ముడితత్వం నీకు బాగా వచ్చినట్లుంది. వాడు అంత పెద్దకబుర్లూ చెప్తాడు. కూలివాడికి నాలుగు అణాలు ఎక్కువ ఇమ్మంటే ఎందుకివ్వా లంటాడు. రైతులు ఎవరన్నా బకాయిపెడితే వాడికి శివం ఎత్తుతుంది. అడుక్కునేవాళ్లకు ఇంత అన్నం పడేస్తే "వాళ్లని ఇలాగే పాడుచేస్తున్నారు. దేశంలో సోమరితనాన్ని ప్రోత్సహిస్తున్నారు. వాళ్లనిట్లా పోషించే వాళ్లల్లోని విప్లవశక్తిని, విప్లవజ్వాలలను చల్లారుస్తున్నారు" అంటాడు. తనుమాత్రం ముప్పూటా వేళతప్పకుండా సుష్టుగా భోంచేస్తాడు. ఇది ఏం సిద్ధాంతమో, ఏం న్యాయమో నాకు తెలీదు. అసలు అందరూ ఒక్కటే అనిగదా వాడి వాదన ! అందరూ సమంగా అనుభవించాలనేగదా వాడి సిద్ధాంతం! అంతా సమిష్టిగా ఉండా లనేగదా వాడు అందరికీ చెప్తుంటాడు! మరి వాడి విషయం వచ్చేసరికి ఈ జాయింటు కుటుంబాన్ని విచ్ఛిన్నంచేయా లంటాడు. అసలు ఆ ఎర్రజెండా ముఠాతీరే అంత. ఇలాంటివ్యక్తులు కుటుంబాలకు వేరుపురుగు లైనట్లుగా వాళ్ల ముఠా సంఘానికి వేరుపురుగైంది. వాళ్లు నీకు ఆదర్శమైతే మనిద్దరం కాపరమే

"చేయలేం"అని మనోహరం ఎంతకాలంగానో అణచుకుంటున్న భావాలను ఒక్కసారి వెళ్లగక్కాడు.

"అనూ, నువ్వు తొందరపడకు. వాడి భాగం ఎలాగో వాడికి పంచియిస్తాం. లేకపోతే అసలుకే ముప్పు వస్తుంది. ఆతరవాత నేనూ, మాఅన్నా వ్యవహారాలు సరిచేసుకుంటాం. ఏదీ ఒక్కరోజులో జరగదు. రష్యాలో విప్లవంకూడా పరిపక్వమై ఫలించడానికి రెండు దశాబ్దాలు పట్టింది. అది జరిగి నాలుగుదశాబ్దాలవుతున్నా ఆ ఫలితాలు అందరికీ అనుభవానికి రాలేదు. వాడు నీకు చేస్తున్న బోధల్ని నేను వింటూనే ఉన్నాను. మావొదినే ఇదంతా చూస్తూనే ఉంది. నువ్వు చదువుకున్నదానివి కదా, అసలువిషయం నీకే గ్రహింపుకు వస్తుందని నేను ఇంతకాలం ఉపేక్షించి ఊరుకున్నాను. మావొదినె వాడి టోపీలో పడుతుందేమో అని భయంగానే ఉంది. మాఅన్న మనస్సు కూడా ఈ మధ్య కొద్దిగా మారినట్లు కన్పిస్తుంది. మనం తొందరపడ్డంవల్ల ప్రయోజనం ఏమీ లేదు. సహనంతో ఎంతైనా సాధించవచ్చు. నిలకడమీద నీకే అనుభవానికి వస్తుంది—మనమార్గమే సన్మార్గ మని. భాగంపెట్టమని మాఅన్నను అడగడానికి "ఎర్రజెండా ముఠాతో చేరిపోతా"నని చెప్పక్కర్లేదు. యథార్థం చూస్తే వాళ్లంతా ఏంచెప్తున్నారో అదంతా మనం చేస్తున్నాం. వాళ్లకూ మనకూ ఉన్న తేడా ఒక్కటే. మనం చేస్తున్నది పైకి చెప్పడం లేదు; వాళ్లు పైకి చెప్పేది చేయడం లేదు. నువ్వు అన్నీ చదివినదానివి. నిజానికి మన జాయింటుకుటుంబానికి మించిన సామాజికవ్యవస్థ ఏముంది అనూ? ఎవరిభాగం వాళ్లు పంచుకొని ఏకాపరానికి ఆకాపరం వేరైపోతే అభాగానికీ శుభానికీ ఒకళ్లకొకరు ఆదుకోవడం సాధ్యమా? ఎవరితోనూ నిమిత్తంలేని బ్రతుకు ఏంబ్రతుకు? ఎందుకా బ్రతుకు?"

* * *

అనూరాధ చిన్నప్పట్నుంచీ అతిగారాబంగా పెరిగింది. తమ్ముడు మురళీధర్ ఒక్కడే మొగపిల్లాడైనా సీతయ్యా, లక్ష్మమ్మా అనూరాధంటే ప్రాణాలువిడుస్తూ ఉండేవాళ్లు. పుట్టినప్పుడే అనూరాధకు సంబంధం కుదిరింది. మేనరికం తప్పదని అందరూ తీర్మానించుకున్నారు. సీతయ్యఅప్పగారు బాగా ఉన్నవాళ్లు. పెద్దకొడుకు రామమోహన్‌కు తండ్రివైపు సంబంధం చేసుకున్నారు. రెండోవాడికి తన తమ్ముడికూతుర్ని చేసుకోవాలని సీతయ్యఅప్పగారు ఎప్పుడో నిశ్చయించుకుంది. పెద్దపిల్ల సరళకూ, మనోహరానికీ ఈడు గాదని అనూరాధనే చేసుకోవాలని అనుకుంది. పైగా సరళకంటే అనూరాధే అందంగా ఉంటుంది. మంచి చురుకైన పిల్ల. తనకొడుకులు ముగ్గుర్లోనూ మనోహరం అందగాడు, చదువుకుంటున్నవాడు. కాబట్టి అనూరాధనే చేసుకోవాలని రాఘవమ్మగారు అనుకుంది. మనోహరానికీ అనూరాధను చేసుకోవాలనే ఉంది. అయితే చదువుకున్న పిల్ల కావాలని అతని పట్టుదల. అందుకని సీతయ్య వూళ్లోనే బడి ఉంది కనుక ఉన్నంతవరకూ అనూరాధను చదివించాడు. మనోహరం బియ్యే ప్యాసయ్యేసరికి అనూరాధ స్కూలుఫైనలు పూర్తిచేసింది. ఆసంవత్సరం వేసంగిలోనే వివాహం అయింది. అయినా అనూరాధను ఇంకా చదివించాలనీ, తను 'లా' చదవాలనీ, పట్నంలో కాపరం పెట్టాలనీ మనోహరం ఎంతో ఉబలాటపడ్డాడు. వాళ్ల నాన్నకూడా కొడుకును ప్లీడరీ చదివించాలని ఉండేది. కాని అనూరాధను కాలేజీచదువుకు పంపించాలని లేదు. మనోహరంఅన్న రామమోహనుకుమాత్రం పట్నంలో వేరే కాపరం పెట్టి తమ్ముణ్నీ మరదల్నీ చదివించడం ఇష్టంలేదు. అందుకు రెండు కారణాలున్నాయి. ఒకటి పట్నంలో కాపరం అంటే నెలకో రెండు పచ్చనోట్లు కావాలి. ఇద్దరి చదువులకూ ఇంకో రెండు కావాలి. ఇలా ఏడాదికి అధమం నాలుగువేలన్నా కావాలి. వేర్లుబడితే మనోహరానికి అంత వరుమానంవచ్చే ఆస్తి రాదు. జాయింటు ఆస్తిలోనుంచి ఒక్కడికోసరం ఇంత ఖర్చు పెట్టడం న్యాయం గాదని రామమోహనుఅభిప్రాయం. అయినా తమ్ముణ్ణే చదివించేవాడే—ఇంకో భయం లేకపోతే. ఒకసారి వేరే కాపరం పెడితే, అందులోనూ పట్నంలో, ఇక మళ్లీ అందరితోనూ కలిసి కాపరం చేయడానికి ఏఆడదీ వొప్పుకోదని రామమోహనుసిద్ధాంతం. ఎంత చదువుకున్నవాళ్ళయినా తమదాకా వచ్చేసరికి అన్నింటికీ స్వస్తిచెప్తారు. మనోహరం వేరేకాపరం పెట్టడమే సంభవిస్తే తన తాతముత్తాతలనుంచి వస్తున్న ఈజాయింటు కుటుంబం మూడుముక్కలైపోతుందని పెద్దవాడి భయం.

ఆఖరువాడప్పుడే "భాగం, నాభాగం" అంటున్నాడు. పంచకపోతే ముఠాలో చేరతానని బెదిరిస్తున్నాడు. వాడికి వీధిబడిచదువు తప్ప ఇంకోచదువు లేకపోయినా "ప్రపంచమహానాయకులు, విప్లవమూర్తులు" అంటూ ఏమేమో చెప్తాడు. ఏవిషయంవచ్చినా వారు ఇట్లా చెప్పారంటాడు. ఈ ఏడాదీ వాణ్ణి అదుపులో ఉంచుకురావడం బ్రహ్మాండమైంది. మనోహరం పట్నంలో వేరే కాపరంపెట్టితే ఇక వీణ్ణి పట్టిఉంచడం బ్రహ్మదేవుడికి కూడా సాధ్యంకాదు.

ఇవన్నీ ఆలోచించే మనోహరం ప్లీడరీ చదవడానికి రామమోహను ఒప్పుకోలేదు. పైగా చదువుకని పట్నంపోయిన మునసబుగారి కొడుకు అక్కడి అల్లరిమూకతో చేరి సమ్మెలనీ, ముఠాలనీ చదువుకు స్వస్తి చెప్పి ఎవరికీ కన్పించకుండా ఇప్పటికి రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్నాడు. కొడుకు ముఠాలో చేరిపోయినాడని తండ్రికి మున్సబుగిరీ ఊడింది. సగం ఆస్తిని గవర్నమెంటువాళ్లు జప్తుచేశారు. మనోహరం పెళ్లాంతోసహా చదువుకు పట్నం పోతాననేసరికి రామమోహనుకు ఇదంతా కళ్లకు కట్టినట్లయింది. సంసారంగుట్టు నిలుపుకోడానికి తాను ఎంతైనా చేస్తాడు. తన తమ్ముళ్లూ అలాగే చేయాలని అతని వాదం.

మనోహరం అన్నగారి మాటను కాదనలేక చదువుకు స్వస్తిచెప్పాడు. అందరితోపాటు ఇంటిపట్టునే ఉండిపోయినాడు. కాలక్షేపానికి పదిమంది పిల్లల్ని పోగుచేసి హిందీ, ఇంగ్లీషు చెప్తూఉండేవాడు. పిల్లలు ఇచ్చే డబ్బుతో తన క్కావాల్సిన పుస్తకాలు, పేపర్లు తెప్పించుకుంటూఉండేవాడు. ఆవిధంగా తన అవసరాలకు జాయింటుఆస్తిలోనుంచి కానీ ఖర్చు చేసేవాడుగాదు. అందుచేత ఆఖరివాడి మీదకంటె రామమోహనుకు మనోహరంమీదనే ఎక్కువగౌరవం; అభిమానం. అయితే ఆఖరువాడంటే అమితభయం. అప్పట్లో అతను అనుకోవడం కుటుంబానికి తన తమ్ముడు మురళివల్లనే ముప్పుందని. చదువుకున్నవాళ్లని నమ్మరాదని, వాళ్లు ఏక్షణంలో ఏం చేస్తారో వాళ్లకే తెలియదనీ ఇతని నమ్మకం. మనోహరం భార్యాభర్త లిద్దరూ చదువుకున్నవాళ్లవడమే ఇతని ఈ భయానికి కారణంకూడా. తనపై సర్వాధికారం చెలాయిస్తూ, ఆవిధంగా కుటుంబాన్ని అంతా ఏలుతున్నతన భార్య సత్యవతమ్మే తన కుటుంబవిచ్ఛిత్తికీ, తన పతనానికీ దారితీస్తుందని, కారణభూతం అవుతుందని అతను కలలోకూడా అనుకోలేదు. తరువాత జరిగిన సంఘటనలను విన్నవారందరూ "పాపం! రామమోహను" "స్వతంత్రాలోచన లేకపోతే ఎంత తెలివిగలవాళ్లయినా ఇంతే" "పెళ్లాంమాట విని సుఖపడ్డవాళ్లీ లోకంలో ఎందరున్నారు?" అని విపరీతంగా సానుభూతి చూపించారు. ఒక్క సానుభూతిసభలు చేయలేదన్నమాటేగాని మిగిలిన కర్మకాండంతా జరిపించారు. ఒక్క అనూరాధమాత్రం పైకి మనోహరంతో పాటు విచారాన్ని అభినయించినా, సత్యవతమ్మ ఇల్లు వదలిపోయినందుకూ, రామమోహను 'సన్యసించి'నందుకూ లోలోపల చాలా సంతోషించింది. ఎవరికివాళ్లు వేరే ఉండి పోయినట్టయితే సంసారం ఇలా అల్లరిపాలై ఈ అపవాదంతా తన తమ్ముడిమీద పడేది కాదనిఎప్పుడూ-ఇప్పటికికూడా-మనోహరంతోవాదిస్తూ ఉంది. పూర్వాచారాలవల్ల లాభనష్టాలు రెండూ సమంగా ఉన్నవనీ, మనుషులు మంచివాళ్లయితే సంప్రదాయాలవల్ల సత్ఫలితాలను పొందుతారని మనోహరం తీర్మానించుకున్నాడు. అదే అనూరాధకు అనుక్షణం బోధిస్తూవచ్చాడు. సంఘాన్నిగాక, సంఘాన్ని ఆవరించిన పరిస్థితులను సంస్కరించడమే సరియైన మార్గం అనుకున్నాడు. అంతవరకే అతను తన తమ్ముడితోనూ, తన భావమరిదితోనూ ఏకీభవించాడు. వాళ్ల పద్ధతులూ, వారి వ్యవహారాలూ మాత్రం అతనికి నచ్చలేదు. తన చదువు తనకూ, తనభార్యకూ ఆమాత్రం విచక్షణాజ్ఞానం ఇచ్చినందుకు చాలా తృప్తిపడ్డాడు. చదువుకోకపోతే తనూ తన తమ్ముడిమాదిరే అయ్యేవాణ్ణనీ, తన 'రాధ' తన వొదినగారల్లేనే అయ్యేదనీ అతను అనుకున్నాడు. రామమోహనుకూడా చివరిచివరికి అతనితో ఏకీభవించాడు. అందుకనే తన పిల్లల్నందర్నీ అయిదోఏటే బళ్ళో వేసి, ఇంటిదగ్గర మేష్టర్ని పెట్టి చదువు చెప్పిస్తున్నాడు. అరచేతిలో వైకుంఠం చూపిస్తే అజ్ఞానులు మోసపోయినంతగా చదువుకున్నవాళ్ళు శాస్త్రలోకజ్ఞానం కలవాళ్లూ మోసపోరని అతని కొక నమ్మకం కుదిరింది. తనకూ ఆకుటుంబవ్యామోహం అంత గాఢంగా లేకపోతే తనూ తన పెళ్లాంమాటలు విని ఏమైపోయేవాణ్ణో అని తలుచుకొని భయపడే

వాడు. తన పిల్లల్నయినా బాగుచేసుకోవాలన్న పట్టుదలే అతన్నింకా అలా ప్రాణంతో నిలబెడుతూ ఉంది. లేకపోతే తన కుటుంబానికి జరిగిన అగౌరవానికి, అందులో తనకు గల బాధ్యతకు ఏ నుయ్యో గొయ్యో చూసుకోవాల్సింది.

* * * * *

సత్యవతమ్మసంగతి తెలిసినవాళ్ళుకాని, సత్యవతమ్మను చిన్నప్పట్నుంచీ ఎరిగిఉన్నవాళ్లుగాని ఆమె ఈ విధంగా నిక్షేపంలాంటి సంసారంలో నిప్పుపెట్టి చక్కా వెళ్తుందని ఎవ్వరూ అనుకోలేదు. నలుగురుబిడ్డల తల్లి అన్నమాటేగాని పాతికేళ్లయినా నిండలేదు. పదహారేళ్ళకే కాపరానికి రావడం, ఏటా కాన్పుఅవడంవల్ల తనకు ఎంత ఇష్టం లేకపోయినా ఇరవైరెండేళ్ళకే ఈ నలుగుర్నీ కన్నది. తోడికోడళ్ళు ఇద్దరికీ ఇంతవరకూ సంతానం లేదు. అందుచేతనే వాళ్లు 'మొగుడూ పెళ్లాం' అంత సరదాగా, కులాసాగా ఉంటున్నారని సత్యవతమ్మ అనుకుంటూఉండేది. బయటి ప్రపంచంసంగతి తెలియనంతవరకూ ఇంత పెద్ద కుటుంబానికి తనదేగదా పెత్తనం అని ఎంతో సంతోషిస్తూఉండేది. అంతకుమించి ఆడదానికి కావాల్సిందిమాత్రం ఏముంది అనుకునేది. తన మొగుడు తన మాటను కాదనడు. తన ఇంట్లో తన మాటకు ఎదుర్లేదు. తనూ, తన పిల్లలూ సుఖంగా ఉన్నారు. అదే తృప్తి. ఆడదానిజీవితపరమావధి అదేగదా అని అనుకుంటూ ఉండేది.

ఆరోజు తను వెళ్ళను అని ఎంత మొత్తుకొన్నా వినకుండా, రామమోహను తనను తనమరిదివెంట బెజవాడ పంపించటమే వచ్చింది. పెద్దపిల్లాణ్ణి వెంటబెట్టుకువెళ్ళినా, తోడికోడలు పుట్టింటికి వెళ్ళకుండా ఉన్నా సత్యవతమ్మకు ఈబుద్ధి పుట్టేదిగాదు. అంతకుముందు అనూరాధతమ్ముడు ఎన్నిసార్లు వాళ్లింటికి రాలేదు? ఎన్నిసార్లు ఈఎర్రజెండాల కబుర్లు చెప్పలేదు? తన మరిదిమాత్రం అవకాశం దొరికినప్పుడల్లా నూరిపొయ్యడం లేదూ? అయినా సత్యవతమ్మ అగ్నిహోత్రంలా అలా ఉండలేదూ! ఒకరోజు సినిమా చూడ్డానికని వెళ్తే నాలుగురోజులు ఉండిపోవాల్సివస్తుందనీ, అక్కడ తన మరిదీ, తన తోడికోడలూ, రెండోతోడికోడలు తమ్ముడూకలిసి కుట్రపన్ని ఇంత అఘాయిత్యం చేస్తారనీ ఏమాత్రం అనుమానం ఉన్నా సత్యవతమ్మ ఊరుకదిలి వెళ్లేదికాదు. ఆమాత్రం అనుమానం రామమోహనుకుఉన్నా అతను పంపించేవాడూ కాదు. అథవా, ఆసినిమా చూపించాలని అనుకున్నా తనే స్వయంగా వెళ్లేవాడు. అయినా కేవలం తన భాగం పంచుకొని తన ఇష్టం వచ్చినట్లు ఊరేగడానికి మురళీధర్ ఇంత కుట్ర పన్నుతాడని ఎవరుమాత్రం ఏమనుకోగలరు? ఎర్రజెండాలవాళ్లు ఎంతకైనా తెగుదురని సత్యవతమ్మ వినకపోలేదు. కాని తన విషయంలో స్వంతమరిది ఇలా చేస్తాడని అనుకోలేదు. ముందుముందు సత్యవతమ్మకు పశ్చాత్తాపంఅనేది ఏమైనా వస్తే అప్పుడివన్నీ ఇలా తలపోసుకొని, విలపించవచ్చు. అసలు ఆ ముఠాలో చేరిపోయిన చదువురానివాళ్లెవ్వరూ పశ్చాత్తాపపడినట్లు ఇంతవరకూ విన్లేదు.

సత్యవతమ్మలో ఇలాంటి 'విప్లవాత్మకమైన' పరివర్తనం రావడానికి యథార్థం విచారిస్తే కారణాలేమీ కన్పించవు. అనూరాధ మొగుడు బియ్యేప్యాసైనాడనీ, తన మొగుడు అంత చదువుకున్నవాడు కాదనీ అనూరాధపై ఆమెకు కొంచెం అసూయ ఉంటూఉండేది. తనూ చిన్నప్పుడు చదువుకొనివుంటే తనకూ చదువుకున్న మొగుడు వచ్చిఉండేవాడనీ, అప్పుడు తనూ, తన మొగుడూకూడా అనూరాధ-మనోహరంలాగా ఉండేవాళ్ళంగదా అని అప్పుడప్పుడు బాధపడుతూఉండేది. దానికి తగ్గట్టు మనోహరం ఎక్కడికి వెళ్లినా అనూరాధను వెంటబెట్టుకువెళ్ళేవాడు. ఇది సత్యవతమ్మకు పుండుమీద కారం రాసినట్లు ఉండేది. అందుకనే వాళ్లకు మొహంమీద కొట్టినట్లుండాలని రామమోహన్ను బెజవాడకు ప్రయాణం చేసింది. ఆఖరుక్షణంలో పని అడ్డంవచ్చి అతను వెళ్లకపోవడం, సత్యవతమ్మ మరిదివెంట పోవలసిరావడం తటస్థించింది. ఆ ఆశాభంగంతో, అవమానంతో బెజవాడ వచ్చింది. మురళీధర్ తన వొదినగారి మానసికస్థితిని చక్కగా ఉపయోగించుకున్నాడు. అనూరాధతమ్ముడు ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకున్నాడు. సత్యవతమ్మకూడా అనూ

రాధపై ఉండే అసూయకొద్దీ అనూరాధతమ్ముణ్ణి చేరదీసింది. ఎవరిమటుకు వాళ్ళు తమ స్వంతలాభంకోసరం వ్యవహరిస్తూవచ్చారు. చివరికి వీరి అందరి గమ్యస్థానమూ ఒక్కటే అయింది!

ఆరోజు సత్యవతమ్మ, మరిదీ ఆరుగంటలసినిమా చూచి హోటలుకు వెళ్ళి భోజనంచేసేసరికి ఇంటికి తిరిగిరావడానికి ఉన్న ఒక్కరైలుబైమూ తప్పింది. ఆ రాత్రి అపూర్లో ఉండకతప్పిందిగాదు. మురళీధర్ ముందుగానే అన్నీ అనుకొన్నాడు కాబట్టి వదినగార్ని వెంటబెట్టుకొని ముఠాకేంద్రానికి వెళ్లాడు. అక్కడున్న జనాభాను చూచేసరికి సత్యవతమ్మ నిర్ఘాంతపోయింది. ముందు అనూరాధ అప్పగార్ని చూసింది. క్షణంసేపు నమ్మలేకపోయింది. అంతమంది మగాళ్లమధ్య ఎందుకు ఇలా ఉందా అనుకుంది. ఇంతలోకే అనూరాధ తమ్ముడూ వచ్చాడు. కుశలప్రశ్న లడిగి పెద్దప్పగార్ని ఆడవాళ్ళ హాలుకు తీసుకువెళ్లాడు. అక్కడ మురళీధర్ భార్య ప్రత్యక్షమైంది. వీళ్లంతా ఒకేరోజున ఒకేచోట ఇలా ఎందుకు చేరారా అనుకుంది. అంతా తన మాదిరిగానే వచ్చారనుకుంది విషయం తెలియకముందు. ఇంతమంది ఎరిగిఉన్నవాళ్లు కనిపించేసరికి సత్యవతమ్మకు అక్కడ ఏదీ కొత్తగా కన్పించలేదు. అయితే ఆడవాళ్లూ, మొగవాళ్లూ అనే భేదం లేకుండా, కొత్తా పాతా అనే వ్యత్యాసం లేకుండా, అంతా అయినవాళ్లల్లే ప్రవర్తించడం మాత్రం విచిత్రంగా కన్పించింది. మధ్య మధ్య అనూరాధఅప్పా, మురళీధర్ భార్యా మరెవరితోనో వాగ్వాదాలు చేయడం, పెద్దపెద్ద కబుర్లు చెప్పడం, చివరికి వాళ్లు వీళ్ళమాటనే ఔననిపోవడం చూచి ఆశ్చర్యపడింది. తన తెలివితేటలముందు మురళీధర్ భార్య తెలివితేటలెంత అనుకుంది. అనూరాధఅప్పకు తనకు తెల్సినంతవరకూ—అంటే ఏడాదికిందటివరకూ అక్షరజ్ఞానమైనా లేదు. ఇప్పుడో? పత్రికలు, పుస్తకాలు గబగబ చదివేస్తుంది. ఎంతవాడిముందరైనా జడుపూ బెదురూ లేకుండా—వెనకటిరోజుల్లో కాంగ్రెస్‌వాళ్ళ మాదిరిగా—ఉపన్యాసాలు దంచేస్తుంది. ఇంచుమించు ఆ శిబిరంలో ఉన్న ఆడవాళ్ళందరికీ నాయకురాలల్లే పని చేస్తున్నది. ఇంతలో సరళ ఇంత గొప్పది ఎట్లా అయిందా అనుకొంది. తనైతే నాలుగుమాసాల్లో అంతకంటే గొప్పదాన్ని కాగల్ననుకుంది. అక్కడున్నంతసేపూ సత్యవతమ్మకు ఇంటిమాటే జ్ఞాపకానికి రాలేదు. ఆ విషయం ఆలోచించడానికి వ్యవధే చిక్కలేదు. ఇదివర్లో తను ఈ ముఠాలనుగురించి విన్నసంగతులకూ తాను కళ్లారా ఇక్కడ చూస్తున్నదానికీ ఎంతవరకూ సరిపోతుందా అని లోలోపల విచారించుకుంటూఉంది. ఆడాళ్లూ, మగాళ్లూ కలిసిమెలిసి అంతా సమానంగా ఉండటంమించి తను విన్న 'బూతు' ఏమీ ఇక్కడ కన్పించిందిగాదు. చాలామంది ఆడవాళ్లు తమ భర్తలతోనూ, చాలామంది మగాళ్ళు తమ భార్యలతోనూ ఉండటం చూచింది. అందువల్ల అనుమానాలకు ఎక్కడా ఏమీ ఆధారం కన్పించలేదు.

ఆ రాత్రి గోష్ఠి పూర్తిఅయి తెల్లవారి ఎవరు ఏపనిచెయ్యాల్సిందీ నిర్ణయించుకునేసరికి రాత్రి ఒంటిగంటయింది. అంతా కలిసి అక్కడే పడుకున్నారు. మురళీధర్ తనకు మళ్ళీ కన్పించకపోవడంవల్ల సత్యవతమ్మ అనూరాధఅప్పా, తమ్ముళ్ళతో ఉండిపోవాల్సివచ్చింది. అనూరాధఅప్పను అడిగి సత్యవతమ్మ తన అనుమానాలన్నీ తీర్చుకొని అసలువిషయం తెలుసుకోవాలనుకుంది.

అనూరాధఅప్పకూడా అలాంటి అవకాశం కోసమే ఎదురుచూస్తూఉంది. ముఠాలో సత్యవతమ్మను చేర్చగలిగితే ఆమెనాయకత్వం స్థిరపడిపోతుంది. ఇంకా అలాంటివాళ్లను ఆకర్షించడానికి వీలవుతుంది. సావధానంగా, బాగా అర్థమయ్యేటట్లు తన ముఠాఆదర్శాలు ఏమిటో, వాటిని సాధించడానికి ముఠాపెద్దలు నిర్దేశించిన కార్యక్రమం ఏమిటో పూసగుచ్చినట్లు సత్యవతమ్మకు చెప్పింది. ముఠామెంబర్లకు నీతి లేదని ప్రచారం చేసింది ముఠాఆదర్శాలంటే గిట్టనివాళ్లని అనూరాధ అప్ప చెప్పిన విషయం నిజమే అని సత్యవతమ్మ నమ్మింది. ఉభయులూ ఇష్టపడితేనే పెళ్ళిళ్లుగాని, లేకపోతే ఎవరి జీవితం వాళ్లదే అనీ, ఇందులో బలాత్కారం అనేది ఏమీ లేదనీ, ముఠారూల్సు అనేవి అసలే లేవనీ సత్యవతమ్మకు బుజువైంది. మంచివాళ్ళు ముఠాలో చేరిపోతారేమో అనే భయంకొద్దీ కొందరు

స్వార్థపరులూ, ఆడవాళ్ళపై తమ అధికారాన్ని స్థిరపరుచుకోవాలని తాపత్రయపడే మగాళ్లూ ఈ దుష్ప్రచారం చేశారని అనూరాధతమ్ముడు చెప్పింది అది. రాలా నిజం అనుకుంది. తన మరిదీ, భార్యా నిక్షేపంలా ఉంటున్నారు. అంతకంటే సత్యవతమ్మకు బుజా వేం కావాలి? ఈ లోకజ్ఞానం అంతా తెల్సుకోనిపోతే అనూరాధ ఎంత చదివినా తనతో సమానం కాదనుకుంది. ఈవిధంగా ఆలోచిస్తూ ఆరాత్రంతా గడిపింది.

కాని తెల్లవారేసరికి ఇల్లూ, పిల్లలూ, రామమోహనూ గుర్తుకువచ్చారు. మరిదికోసరం వెదికింది. అనూరాధఅక్కను అడిగింది. రైలుకు ఎవరో గొప్ప నాయకుడు వస్తాడని మురళి స్టేషనుకు వెళ్లినట్లు తెలిసింది. తనంతట తానే వెళ్దామనుకుంది. ధైర్యం చేయలేకపోయింది. పైగా తనదగ్గరున్న డబ్బుకూడా రాత్రి మరిది కిచ్చింది- దాచమని. మురళీధర్ కన్పిస్తేగాని సత్యవతమ్మ ముందు కార్యక్రమం నిర్ణయించుకోలేకపోయింది.

మురళీధర్ శిబిరానికి తిరిగివచ్చేసరికి మధ్యాహ్నం భోజనాలవేళయింది. సాయంత్రం గాంధీ ఇర్విన్ పార్కులో బ్రహ్మాండమైన బహిరంగసభ ఉందనీ, అది చూచుకొని రాత్రికి ఇంటికి వెళ్దామని ఒదినగార్ని వొప్పించాడు. ఆబహిరంగసభే సత్యవతమ్మను పూర్తిగా మార్చివేసింది. అప్పటికప్పుడే తీర్మానించుకుంది మర్నాడు ప్రారంభమయ్యే శిక్షణతరగతుల్లో చేరాలని. రామమోహనుకు చెప్పి వొప్పించగలననుకుంది. తనపిల్లల్నిగూడా తనతోనే ఉంచుకోవచ్చుననుకుంది. ఆవిధంగా ఎంతమందో సంసారాలతో వచ్చేసి శిబిరంలో ఉంటున్నారు. రామమోహను వొప్పుకుంటే అతనూ తనవెంట వచ్చివేయవచ్చు. ఈ నాలుగుమాసాలైన తరువాత ఇంటికివెళ్లి చైతన్యంగల జీవితాన్ని గడపవచ్చునని ఆశ పడింది. ఆసాయంత్రం జరిగిన బహిరంగసభలో అనూరాధ అక్కకూడా గొప్ప ఉపన్యాసం చేసింది. మాటమాటకీ అక్కడ చేరినవాళ్ళంతా చప్పట్లు కొట్టారు. అనూరాధఅక్క సామాన్యులకు తెలియని విషయాలు ఏవీ చెప్పలేదు. సంఘంలో హెచ్చుతగ్గులు ఉండకూడదనేసరికి అంతా బ్రహ్మాండంగా చప్పట్లు కొట్టారు. కష్టపడి అహర్నిశలూ పొలంలోపనిచేసే కూలీలకు మాత్రమే పొలంమీద హక్కుండా లున్నది. (వినండి వినండి అని కేకలు మిన్నుముట్టినయ్.) "పురుషులకు బానిసలుగా ఉండటానికి స్త్రీలు పుట్టలేదు. దేవుడిదృష్టిలో మగవా ళ్లెంతో ఆడవాళ్లూ అంతే. కేవలం వంటింట్లో, పడకగదుల్లో కాలం వెళ్లబోసుకోవడానికే దేవుడు ఆడవాళ్లను సృష్టించలేదు. కొందరు సనాతనులు ఈవాదం సరికాదంటారు. వర్ణాశ్రమధర్మాలమాదిరే స్త్రీలనూ, పురుషులనూ ఒక్కొక్క పనికని సృష్టించా రంటారు. నిజంగా దేవుడు అంతపక్షపాతం చూపేవాడైతే మనకు ఆదేవుడు వద్దేవద్దు. మన దేశానికి ఇరుగుపొరుగుగా ఉన్నది ఒక బ్రహ్మాండమైన దేశం. అక్కడ ఎలాంటి తేడాలూ లేవు. పురుషు లెంతో స్త్రీలూ అంతే. ఇంట్లోనే ఉండి పిల్లల్ని పోషించుకోవాల్సిన అవసరం స్త్రీలకు లేదు. కనటంవరకే స్త్రీలవంతు. ప్రభుత్వం పిల్లల పోషణకు అవసరమైన అన్నిఏర్పాట్లూ చేస్తుంది. ఎవరివృత్తిని వారు నిర్వహించుకుపోవడానికి ఏమీ అడ్డంకు లుండవు. తినటానికి తిండి లేకపోవడమే వ్యభిచారం, రంకుతనం, దొంగతనాలకు కారణం అని అన్నిదేశాలకంటే ముందు ఆ దేశమే గ్రహించి, లేమి అనేది లేకుండా చేయడానికి ప్రయత్నించింది. దేశంలో 'లేమి' అనేది లేకుండా చేసింది ఆ దేశపు ప్రభుత్వం. మనంకూడా ఆమాదిరి ప్రభుత్వాన్ని స్థాపించడానికి ప్రయత్నించాలి. మేము ప్రయత్నిస్తున్నాం. మీరూ మాతో చేరాలి. ఇదిగో ఇటు చూడండి! వీరు సత్యవతమ్మగారు. గంపంత సంసారాన్ని వదలిపెట్టి ఈ లక్ష్యాన్ని సాధించడానికి కంకణం కట్టుకున్నారు. ఈనాడే మన ముఠాలో చేరారు. ఆంధ్రనారీలోకానికి అంతటికీ ఆమెగారు ఆదర్శప్రాయంగా ప్రవర్తించారు." ఈవిధంగా అనూరాధఅక్క ముందరికాళ్ళకు బంధాలు వేసేసరికి సత్యవతమ్మ కట్టుబడిపోయింది. అంతమందిలోనూ తాను అలా చేయలేదని చెప్పుకోవడం గౌరవహీనం అని మాట్లాడకుండా కూర్చుంది. అథవా ధైర్యంచేసి

చెప్పినా అక్కడున్నవాళ్లు తనమాట వినేటట్లు కన్పించ లేదు. విన్నా హర్షించేవాళ్లు ఒక్కరూ ఉన్నట్లులేదు.

అనూరాధతమ్ముడు మహిళాశాఖలో చేరిన ఆంధ్రనారీమణిసౌందర్యాన్నీ, పాతివ్రత్యాన్నీ, దేశ భక్తినీ ప్రశంసిస్తూ ఉపన్యసించగా సత్యవతమ్మ పూర్తిగా చిత్తయిపోయింది. ఈ యవస్థలో ఆమెకు తన ఇంటి సంగతిగాని, రైలుటైముగాని గుర్తుకు రానే లేదు. సత్యవతమ్మ ఆ స్థితిలోనే ఆ రాత్రంతా శిబి రంలో గడిపింది.

*   *   *   *

తెల్లవారేసరికి రామమోహనూ, మనోహరం బెజవాడ వచ్చి మామూలుగా తమతమ్ముడు బసచేసే చోటుకు వెళ్ళి ఆచూకీతీసి సరాసరి శిబిరానికి వెళ్లారు. దార్లో రామమోహనూ, మనోహరం ఒకరితో ఒకరు మాట్లాడుకోనేలేదు. ఘటిల్లిన ఘోరప్రమాదాన్ని ఇద్దరూ గ్రహించినట్లే ఉన్నారు. శిబిరంవాకిటిగుమ్మం దగ్గిర మురళీధర్ దంపతులు కావలికాస్తున్నట్లు ఇద్దరూ చెరోఅరుగుమీదా కూర్చున్నారు. రామమోహన్ అలాగే కుంగిపోయాడు. నోటివెంట మాట రాలేదు. మనోహరమే చొరవచేసుకొని ముందు మరదల్ని పరామర్శచేశాడు. "పుట్టింటినించి ఇక్కడికి ఎప్పు డొచ్చావు ?" అని అడిగాడు. ముతామీటింగు ఉందనీ, అందుకోసరం నాల్గురోజులక్రితం బెజవాడ వచ్చావనీ, ఇంటిదగ్గర అంతా కులాసా అనీ చెప్పింది.

ముతామీటింగు అంటే ఎలా ఉంటుందో మనో హరం ఊహించగలిగాడు. "అది కేవలం వనంతోత్స వమే"అని గ్రహించాడు. వెంటనే"వరేయ్ మురళీ,వదిన వదిరా ? ఇంటిదగ్గర్నుంచి బయల్దేరి మూన్నాళ్లయింది. ఏ కబురూ తెలియజేయకుండా నువ్వు ఇలా సీగోడ వలో పడిపోతే ఇంటిదగ్గర పిల్లలంతా ఏమైపోతా రను కున్నావురా ? ఇప్పు డెక్కడుంది మీ వొదినె?" అని తమ్ముణ్ణే ప్రశ్నించాడు. మురళీధర్ భార్య అందుకొని "ఇక్కడే ఉన్నారు. కాని మీ రామెను చూడ్డానికి వీలుగాదు. ఇంటిదగ్గర పిల్లలసంగతి ఇహ బావగారే చూచుకోవాలి. అది వారికి కుదరదంటే వాళ్ళని తీసుకువచ్చి ఇక్కడే వదలవచ్చు. వారికి ఇష్టమైతే అందరూ ఇక్కడే ఉండవచ్చు" అంది.

మనోహరం ఉగ్రుడైనాడు. కాని కార్యసాధన ముఖ్యమని "అది తాపీగా తేల్చుకుందాం. ఒక్కసారి వొదిన్ని రమ్మను. చూచిపోతాం. రానంటే బలవంతం ఏమీ లేదు." అని మళ్లీ మురళిని ప్రాధేయపడి అడి గాడు. "వరేయ్ మనోహరం, అదుగో మీ బావమరిది. ఆ ప్రక్కన ఉంది మీ వొదినేనట్లేనే ఉంది. వాణ్ణే పిలు. అదీ ఇలా వస్తుందేమో !" అని ఎంతో ఆశగా రామ మోహను అన్నాడు. తన బావమరిదివల్ల మేలుకంటె కీడే ఎక్కువ జరుగుతుందని మనోహరానికి తెలుసు. అయినా కేకవేస్తే ఇద్దరూ ఇటు తిరిగిచూస్తారుగదా అని పిల్చాడు. వాళ్ళిటు తిరిగిచూచి కాస్సేపు నిలబడి "తొందరపన్లో ఉన్నాం. నాలుగురోజులదాకా తీరదు. తరువాత వచ్చి కన్పిస్తాను" అని అనూరాధతమ్ముడు సమాధానం చెప్పాడు. సత్యవతమ్మ ఆమాటైనా చెప్పలేదు. చూచి నవ్వుకుంటూ వెళ్ళిపోయింది. ఇంక లాభం లేదని అన్నదమ్ములిద్దరూ ఇంటిదారి పట్టారు.

*   *   *   *

"ఏంబావా, అక్క ఏమైంది? ఎక్కడుంది? కన్పించనేలేదా? బావగారు అలా దిగులుపడిపోయినా రేం ? ఏం జరిగింది? చెప్పు బావా" అని అనూరాధ మనోహరాన్ని వేధించింది. "నా కేం తెల్సు? మీ తమ్ముణ్ణే అడుగు. ఇప్పుడు వాడే ఆవిడకి గార్డియన్. నువ్వు సాధించలేక తమ్ముణ్ణే ఇలా ప్రయోగించావేం" అని మనోహరం ఉండబట్టలేక అనేశాడు. "అదేమిటి బావా, అలా అంటావు? మాతమ్ముడు నాతో మాట్లా డటం మానేసే ఏడాదయింది. ఇక్కడికి వచ్చినా మీ తమ్ముడూ, మీవొదినే వాడి వ్యవహారం అంతా చూచి నంపేస్తూఉండేవాళ్లు. పైగా వాళ్లిద్దరూ కలిసి నన్ను నానామాటలూ అనేవాళ్లు. మధ్య నే నేం చేశాను?" అని పాపం, అనూరాధ బిక్కమొహం వేసింది.

అనూరాధశోక్యం ఏమీ లేదిందులో అని మనోహరానికీ తెలుసును. అయితే తన అన్నబాధ చూచి సహించలేకపోయినాడు. రామమోహనుబాధకు అనూరాధతమ్ముడే కారణంగనుక అనూరాధను సాకిస్తే కాస్తమనశ్శాంతి కలుగుతుందని భ్రమ. రామమోహను తప్పంతా తనదే అని లోపలలోపల కుమిలిపోతున్నాడు. తను అలా, తన తమ్ముడిసంగతి తెలిసి ఉండీకూడా, సత్యవతమ్మను పంపించడం తప్పనుకున్నాడు. ఆ ముఠాగాలి సోకితేచాలు, ఇక ఆపడం ఎవరికీ సాధ్యంగాదు. ఆరోజు తనే వెళ్లివుంటే ఇంత పని జరిగేదా? లేక బలవంతంగా సత్యవతమ్మను పంపకుండా ఉంటే ఈ సంసారం ఇలా అయిఉండేదా? ఇంతకూ ఇప్పుడు ఏమనుకుంటే ఏంలాభం? తనకూ లేదు చదువు; తన భార్యకూ లేదు చదువు. చదువు లేకపోవడంవల్లనే అనూరాధఅప్పా, తమ్ముడూ అలా పోయినారు. చదువుకున్న అనూరాధ చక్కగా కాపరంచేస్తున్నది. చదువుకున్నఆడవాళ్లు సంసారం చేయడానికి పనికిరారనే "పెద్దలవాదాన్ని" సత్యంగా గ్రహించి రామమోహను సత్యవతమ్మను పెండ్లిచేసుకున్నాడు. దానికి కారణం తనకు చదువులేకపోవడమే. ఫలితం నేటి తన అనుభవమే అని అమితంగా బాధపడుతున్నాడు.

అప్పట్నుంచీ రామమోహనుకు మనోహరంపైనా, అనూరాధపైనా విపరీతమైన గౌరవం, అభిమానం ఏర్పడింది. వాళ్లకు పిల్లలు లేకపోవడంవల్ల రామమోహనుపిల్లల్నే తమ పిల్లలుగా పెంచుతూ వచ్చారు. ఆవూళ్లో వాళ్లందరికీ సత్యవతమ్మపరివర్తనం ఒక తీవ్రహెచ్చరిక అయింది. అనూరాధప్రవర్తన అందరికీ ఆదర్శప్రాయమైంది. సత్యవతమ్మ లేచిపోయిం తరువాత ఆవూళ్లో ఎలా తలెత్తుకుతిరుగుతామా అని అనుకున్నారు అన్నదమ్ము లిద్దరూ. కాని అనూరాధ పోయిన గౌరవాన్ని తిరిగి సంపాదించడమే గాక తన ప్రవర్తనవల్ల ఆ గౌరవాన్ని హెచ్చుచేసింది.

మనోహరం పంచుకోవాల్సిన అవసరం లేకనే, అందుకు ముఠాలోచేరిపోతానని ఎవర్నీ బెదిరించాల్సిన అవసరం లేకనే అనూరాధ ఇంటియజమానురాలైంది. సత్యవతమ్మ పోయినందుకు విచారించేవాళ్లకంటే అనూరాధ ఇంటియజమానురాలైనందుకు సంతోషించినవాళ్లే ఆవూళ్లో ఎక్కువైనారు. రామమోహను కూడా క్రమంగా సత్యవతమ్మసంగతే మరిచిపోయి తండ్రి పోయినతరువాత మనోహరం, అనూరాధలకు తండ్రిలాగా ఉండి కాలం వెళ్లబుచ్చుకుంటున్నాడు.

* * * *

అప్పటికీ ఇప్పటికీ సత్యవతమ్మ ఏమైందో, ఏ గెరిల్లాదళానికి నాయకత్వం వహించి ఏ విప్లవాన్ని సాధిస్తున్నదో ఎవరికీ తెలియదు. కాని రామమోహనరావు ఇంట్లో దొంగలు పడి ఇల్లంతా దోచి అనూరాధనూ, రామమోహన్నూ కాల్చి పారిపోయిన ముసుగువాళ్లల్లో సత్యవతమ్మా, అనూరాధతమ్ముడూ ఉన్నారని మాత్రం ఊరంతా గోలయింది. ఇది జరిగి ఆరుమాసాలైంది. పోలీసుల విచారణ ఇంకా పూర్తికాలేదు. అప్పుడుగాని నిజం తెలియదు. తీరా తెల్సిన తరువాత అది నిజంకాకనూ పోవచ్చు. లేదా, ఊళ్లో బయల్దేరిన వదంతులే యథార్థం అని ఋజువుకానూ వచ్చు.